# హరిజన విద్యార్థి

"నేను హరిజన విద్యార్థిని, నాకొక్క సీటు దయ చేయండి" అన్నాడు ఒక ముక్కుపోగు అబ్బాయి. అనగానే -

"హరిజన విద్యార్థివైతే నాకేం?" అనాలనిపించింది. గాని ఆ తెలుగు వాక్యం అతనికి అర్థం కాదనిపించింది.

హరిజనుణ్ణి అనే మాట పాస్‌వర్డ్ అయింది. ఆ మాట అనగానే వెంటనే లేచి కావలించుకోవాలి ఆ మాట అన్న మనిషిని. తరువాత గంగాళంలో నీళ్ళు తోడించి ఇద్దరమూ కలిసి పోసుకోవాలి. లేకపోతే క్రిష్ణకు వెళ్ళాలి. తరవాత విస్తళ్ళు తాకుతూ భోజనం చెయ్యాలి. ఒకటే గ్లాసులోంచి తాగాలి. కూతురు వుంటే వివాహమాడి మా కులగోత్రాలను పవిత్రం చేస్తాడేమో కనుక్కోవాలి. ఉద్యోగాలు, స్కాలర్‌షిప్పులు, సీట్లు, ప్రమోషన్లు, అన్ని తలుపులూ "హరిజనుణ్ణి" అనే మాటతో విడిపోతాయి. అన్నీ ఆహ్వానాలే. హరిజనుణ్ణి అనడమూ, గొప్పగా హరిజనుడివా, రా నాయనా, అని కావలించుకోవడమూ.

నాకు మాత్రము కంటకంగా ఉంది. హరిజనుడు అనే పదము పుట్టక పూర్వము యిరవై ఏళ్ళ క్రిందనించి చివరకు కూడా ఎవరినీ "నీ కులం ఏమిటి?" అని అడగని నన్ను హరిజన ద్వేషి క్రింద కట్టేవారుండరని నమ్మకం. ఈ హరిజనోద్ధారకులు అందరూ ఇదివరకు నా బోటివారిని వెలివేసేవారే! ఈనాడు హరిజనులతో భోజనం చేస్తారు గనుక వెలిలేదు. నేను పూర్వం మాలవాళ్ళతో భోజనం చేశాను. గనుక నాకు మాత్రం వెలి ఇంకా పోలేదు.

పోయిన సంవత్సరం ఒక కుర్రాడు చాలాకాలం బడి ఎగకొట్టాడు.

"ఎందుకు రాలేదు?" అన్నాను.

అతను కారణం చెప్పడం యిట్లా ప్రారంభించాడు.

"నేను హరిజన విద్యార్థినండి..."

"హరిజన విద్యార్థివా? నాకు తెలీనే తెలీదే. ఇన్నాళ్ళూ ఆ సంగతి తెలీక నిన్ను దగ్గిరికి రానిచ్చానే? ఇంక దూరంగా వుండు' అన్నాను.

"ఇంకా చాలామంది ఉన్నారండి."

"ఉంటేనేం? వాళ్ళను కులం అడగనూ అడగను. వాళ్ళు చెప్పనూ చెప్పరు. నువ్వు చెప్పావుగా, తెలిసి ఇంక నిన్నెట్టా రానిస్తాను?" అన్నాను.

ఈ హరిజన విద్యార్థి ఏమంటాడంటే, తను హరిజనుడు గనుక తక్కిన వాళ్ళని తోసేసి తనకి సీటు ఇమ్మంటాడు. న్యాయమేమిటా అని ఆలోచించారు.

"హరిజనుడవైతే నేం?" అని తరచి అడిగితే.

"బీదవాణ్ణి గనక" అని తేలుతుంది.

బీద బ్రాహ్మడే ఉన్నాడనుకోండి.

ఎవరికిగాని ఈ సీట్ ఎందుకు?

డబ్బుకి, డబ్బు సుఖానికి, పోనీ జ్ఞానానికి

ఈ యిద్దరిలో 'ఏం చేసేవాడని' అడిగితే చాలామంది హరిజనులు 'కూలి' అనిగాని, 'చెప్పులు కుట్టటం' అని గాని చెపుతారు.

నెలకి ఏ పదిరూపాయలో ఆదాయం ఉండవచ్చు.

బ్రాహ్మణ్ణి అడిగితే 'పౌరోహితుడో, గుమాస్తో, భూస్వామో' అని అంటాడు. సుఖానికి, జ్ఞానానికి అలవాటు పడ్డవాడు బ్రాహ్మడు - కష్టానికి బీదరికానికి అలవాటుపడ్డవాడు హరిజనుడు.

బీదవాళ్ళు - 'అయ్యో ఎంత బీదవాడు' అంటారు.

కాని ఎప్పుడూ బీదవాడు, బీదరికం బాధనెరగడు, మంచి దినాలు చూచిన దరిద్రుడికి వుండే బాధ బీదవాడికేమీ వుండదు.

పుట్టినప్పటినించి మురికిలో, ఆకలిలో, చిరిగిన గుడ్డలలో పెరిగి, ఎండకి, చలికి అలవాటుపడ్డవాడికి పేదరిక మొక కష్టమా? బాలుడుగా వుండేప్పుడు తండ్రి సంపాయించగా, శుచిఐన భోజనమూ, పరుపులూ, యిల్లూ, శాలువాలూ అలవాటు పడ్డవాడు బీదరికానికి ఓర్వడం కష్టం. ఆ హరిజనుడి తృప్తిగాని, ఆరోగ్యంగాని, ఓర్పుగాని యీ కులం గొప్పవాడికి వున్నాయా? ఈ సీటు యీ ఉద్యోగమూ లేకపోతే, తన గుడిసెలో కూనిరాగాలు తీస్తో, గంజితాగి బతికేశక్తి వుంది ఆ హరిజనుడికి. ఆ పదిహేను రూపాయలు లేకపోతే ఆత్మనమ్ముకుని బతకాలి యీ బ్రాహ్మడు. లేకపోతే ప్రాణత్యాగం చెయ్యాలి.

'నేను హరిజనుణ్ణి అనడంలో రాజకీయ కారణాలు, సాంఘిక కారణాలు ఉంటే ఉండవచ్చు. కానీ న్యాయం మాత్రం గొప్ప దశనించి పడిపోయిన ఆ జాతే బాధపడే జాతి. కనికరింపబడవలసిన జాతి. ఒక ధనంలోనే కాదు. రాజసౌఖ్యాలకీ ఆలోచనలకీ సాహసాలకీ అలవాటుపడ్డవాళ్ళు కన్నబిడ్డని బీదతనానికీ - క్షుద్రజారత్వానికీ, స్వల్ప స్వల్ప ఆలోచనలకీ అలవాటైన యింట పెంచితే బాధ తప్పదు. ఆ రక్తానికి తగిన పరిస్థితులుండాలి. పులిపిల్లని పసితనము నించి బోనులో పెంచితే మాత్రం దూకడానికి స్థలంకోసం బాధపడడం మానుతుందా?

తరాలనించి దారిద్ర్యంలో వున్న వాళ్ళ బాధ తలచుకొని పద్యాలూ, వ్యాసాలూ వ్రాస్తారు. పత్రికలనిండా అవే!

కాని సమస్త ఐశ్వర్యాలు అనుభవించిన జాతులపతనం - వారి బాధని గురించి ఎవరూ వ్రాయరే! రాజ్యాలేలిన వాళ్ళు అడుక్కొంటున్నారు.

జ్ఞానతేజస్సుతో నలిగినవాళ్ళు విద్యకై యాచన చేస్తున్నారు - వీళ్ళ బాధని ప్రకటించరేం?

హరిజనుడి గతి తలుచుకొని ఉపన్యాసాల్లో, పద్యాల్లో, కారే కన్నీళ్ళన్నీ ఈ క్రొత్త ప్రచారం వచ్చిందాకా ఎక్కడ దాక్కున్నాయి?

'మా పూర్వీకులు దరిద్రులు గనక నాకు సీటు' కావాలని ఒకడు అడగ్గా లేనిది, నా పూర్వీకులు ఈ దేశాన్నంతా, ఆధ్యాత్మిక జ్ఞానంతో నింపారు. ధనాన్ని తృణప్రాయంగా త్యజించారు. శరీరాన్ని తపింపచేసి, శుష్కించి, ప్రజా సేవ చేశారు. నాకొక్క సీటు' యిమ్మనకూడదూ?

ప్రపంచం చూసినకొద్దీ, మనుషులందరూ ఒకటేనన్న మాట అబద్ధంగా కనపడుతోంది. మృగాలన్నీ వొకటే, మనుష్యులూ మృగాలూ వొకటే, అని అంటే ఎంత వాస్తవంగా వుంటుందో ఇదీ అట్లానే వుంటుంది.

'అయ్యో దున్నపోతు వానలో తడుస్తోంది పడకగదిలో కట్టివెయ్యరా!''

'పంది బురదలో పొర్లుతుంది శుభ్రంగా స్నానం చేయించరా!'

'ఆ చిలక అట్టా ఎగురుతుందే? పడిపోతుంది. పంజరంలో పెట్టరా?'

అన్నట్టవుతుంది మన తెలివి.

లోకమంతా నన్ను 'ఛీ! మాలకూడు తిన్నాడు' అన్న కాలంలో యీ హరిజనోద్ధారక యోధులందరూ 'ఛీ, ఛీ తిన్నాడా! అన్నవారే! అప్పుడు మాలవాళ్ళమీదా, వాళ్ళని తాకిన వాళ్ళమీద వుమ్మేసే రోజులవి.

ఇప్పుడు వాళ్ళనే పూలదండలు వేసి గౌరవించే రోజులొచ్చాయి. ప్రపంచం మెచ్చు కుంటోందని తెలీగానే, వూరికే ఒకరినొకరు తోసుకుని, స్త్రీ పురుషులు పత్రికల్లోకి హరిజనోద్ధారకుల కింది బొమ్మలూ పేర్లు ప్రకటించుకున్నారు.

పదేళ్ళ కింద వారందరూ బతికేవున్నారు. అప్పుడూ యింకో రూపంలో యింకో పేరుతో యీ వుద్యమం వుండనే వుంది. ఏమైనారు వీళ్ళందరు?

ఇతరుల దారిద్ర్యంలో కష్టాలలో సానుభూతి చూపే హృదయం... ఎప్పుడూ చూపుతుంది. ఆ సానుభూతి ఫాషన్ అయ్యేవరకు ఆగదు.

హరిజన నిధికి చందాకి ఒకామె నా దగ్గిరికి.

''మీరు అతనికన్న హీనస్థితిలో వున్నారు. ముందు మిమ్మల్ని మీరు వుద్ధరించుకోండి'' అన్నాను.

"మీరు" అంటే ఎవరండోయ్?

"అంటే స్త్రీలు."

"మాకేం?"

"మీరందరూ అంటరానివారే!"

"ఏం?"

"బహిరంగంగా మొగవారు తాకకూడదుగా!"

ఒక్క గాజులవాళ్ళూ, మంగలవాళ్ళూ తప్ప.

అంతేకాదు. మీలో చూడరానివాళ్ళు ఉన్నారు. హరిజనులకన్న అధమ స్థితి మీది."

"చూడరానివాళ్ళెవరు?"

"గోషావాళ్ళు."

"కాని అంత బీదవాళ్ళం కాదుగా!"

"నాకేం? అందరూ యాచకులే. మొగుళ్ళ దగ్గర."

"ఆస్తివున్న స్త్రీలెందరు? ఎందరు బైటపడి కానీ సంపాదించగలరు?"

"మీ బట్ట మీది కాదు. మీ తిండి మీది కాదు" అన్నాను.

ఆమె వెళ్ళింది కోపంతో.

ఇంకా స్త్రీల ఉద్యమంలో పనిచెయ్యడం కొంతవరకే ఫాషన్ అయింది - మీటింగులూ కాన్ఫరెన్సులూ - కనుక అంతవరకే పనిచేస్తారు. వివేకవంతులందరూ పూలదండలూ - అచ్చులో పేర్లు అదృష్టముంటే బొమ్మలూ!

◆ ◆ ◆

*ప్రచురణ : (చుక్కమ్మ కథల సంపుటి) దేశి ప్రచురణ, పునర్ముద్రణ - 1957*